క్లుప్తంగా

వేతనాలు ఇవ్వండి



సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

పెద్దశంకరంపేట(మెదక్): తమ సమస్యలు పరిష్కరించాలని పేటలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పి.రాములు, వివేక్, భూమయ్య, చాకలి రాములు, మాణయ్య, లచ్చమ్మ, సాయమ్మ, సుశీల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల బురదమయం



హవేళిఘణాపూర్(మెదక్): వర్షంతో మండల పరిధిలోని బీ.తిమ్మాయిపల్లి పాఠశాల ఆవరణం బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలతో అక్కన్నపేట విద్యార్థులు

రామాయంపేట(మెదక్): మాజీ ఎమ్మెల్యే సాయన్న స్మారకార్థం హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బంగారు పతకాలు గెలుపొందారు. పాఠశాలకు చెందిన 11 మంది ఈ పోటీలో పాల్గొనగా, వీరిలో ఆరుగురు విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బ్లాక్ బెల్ట్ మాస్టర్ నాగరాజు, గ్రాండ్ మాస్టర్ హరి ప్రశంసించారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాదులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజలు చట్టాలపై అవగాహన అవసరమని న్యాయవాదులు కరుణాకర్, సిద్ధాగౌడ్ సూచించారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల పరిధిలోని శమ్నాపూర్‌లో మాట్లాడుతూ.. ఫోక్సోయాక్టు, చిన్నారులపై లైంగిక వేధింపులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వరకట్నం కోసం వేధిస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్ధిరాములు, అశోక్, సిద్ధలక్ష్మి, కవిత తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

రామాయంపేట(మెదక్): పట్టణంలోని దళితవాడలో రేషన్ దుకాణాన్ని గురువారం తహసీల్దార్ రజనికుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మున్సిపల్ కౌన్సిలర్లు గంగాధర్, సుందర్‌సింగ్,జయ, నాయకులు పాల్గొన్నారు.

అబ్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా సురేశ్

పాపన్నపేట(మెదక్): మండలంలోని అబ్లాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ముమ్మని సురేశ్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా ముమ్మని ఆగమయ్య, ప్రధాన కార్యదర్శిగా కుమార్, క్యాషియర్‌గా శ్రీశైలం ఎన్నికయ్యారు.

11న శాకాహార ర్యాలీ

నర్సాపూర్: పట్టణంలో 11న శాకాహార ర్యాలీ చేపట్టనున్నామని పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ పిరమిడ్ సేవాదల్ ధ్యాన గద్దర్ భూపతి రాజు ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. నర్సాపూర్‌లో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

పాలన సాగేదెలా..?

- మండల పరిషత్ కార్యాలయంలో ఇద్దరే ఇద్దరు
- పోస్టులన్నీ ఖాళీ..
- ఇన్‌చార్జిలతో ఇబ్బందులు..





మండల పరిషత్ కార్యాలయం. (ఇన్‌సెట్‌లో) ఖాళీగా ఉన్న ఎంపీడీఓ కుర్చీ

పాపన్నపేట(మెదక్): మండలకేంద్రంలో అధికారులు లేకపోవడంతో పాలన గాడి తప్పుతుందని ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లాలో అతి పెద్ద మండలం పాపన్నపేట. 36 గ్రామ పంచాయతీలు, 57,149 మంది జనాభాతో కిటకిటలాడుతుంది. అనునిత్యం ప్రజలతో మమేకమయ్యే మండల పరిషత్ భవనం సిబ్బంది లేక వెలవెలబోతోంది. ఎటు చూసినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. మండలంలో 9 పోస్టులు ఉండగా, ఇద్దరు మాత్రమే రెగ్యులర్ అధికారులు ఉన్నారు. మిగతా పోస్టుల్లో కొంత మంది ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండగా, మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాపన్నపేట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఇటీవల బదిలీ అయ్యారు. కానీ రెగ్యులర్ ఎంపీడీఓ రాకపోవడంతో మెదక్ ఎంపీడీఓకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ సైతం బదిలీ అయ్యారు. ఆ స్థానం ఖాళీగా ఉంది. ఎంపీఓ ఖాళీగా ఉండటంతో సీనియర్ అసిస్టెంట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ, ఏఈ, టైపిస్ట్, వాచ్‌మెన్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ఎంఈఓ, ఏఈలు ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న ఒక సీనియర్ అసిస్టెంట్, మరో జూనియర్ అసిస్టెంట్లు ఆల్ రౌండర్లుగా కొనసాగుతున్నారు. అటెండర్లు కంప్యూటర్ పనులు చూస్తున్నారు. కాగా మూడు అటెండర్ పోస్టుల్లో మాత్రం రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం జోరుగా సాగుతున్న తరుణంలో అధికారుల ఖాళీలు ఇబ్బందిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఎంపీడీఓ, ఎంపీఓ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పరిపాలన గాడి తప్పిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యజమాయిషీ చేసే వారు లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. వివిధ పనుల మీద మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీఓ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పోస్టులు ఖాళీగా ఉండటంతో, ఉన్న ఇద్దరు ఉద్యోగులం పని భారంతో సతమతమవుతున్నాయని వాపోయారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- వ్యవసాయాధికారి రాం ప్రసాద్
- బర్దిపూర్‌లో పత్తిపంట పరిశీలన



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ రాంప్రసాద్

టేక్మాల్(మెదక్): వర్షాలు అధికంగా కురిస్తే పత్తిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో పత్తి పంటను పరిశీలించి రైతులకు పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పత్తి పంటపై పురుగు ఉధృతిని బట్టి పేనుబంక ఆశించి ఉంటే థైయోమి థాక్సమ్ 0.2గ్రాములు లీటర్ నీటికి, తెల్లదోమ ఆశించి ఉంటే డై ఫెన్ థా యు రాన్ 1.25గ్రాములు లేదా స్పైరోమేసిఫెన్ 1మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా నీటి ముంపుకు గురైనా పంటకు త్వరగా కోలుకోవడానికి 19-19-19 లేదా 13-0-45 వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. నేల ద్వారా వ్యాపించే తెగులు అరికట్టడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ని లీటర్ నీటికి కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పంటల్లో అధిక దిగుబడులు రావాలంటే రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని, వ్యవసాయాధికారుల సూచనలతో మందులను వాడాలన్నారు.

బోరుబావుల వివరాల సేకరణ



బోరుబావుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): కాళేశ్వరం కాల్వ ఫేజ్–2లో గుర్తించిన భూముల్లో కోల్పోతున్న బోరుబావుల వివరాలు గురువారం వివిధ శాఖల సిబ్బంది సేకరించారు. శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్, బిజ్లిపూర్, గోమారం, పెద్దగొట్టిముక్ల, చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, పిల్లుట్ల, లింగోజిగూడ గ్రామాల మీదుగా 20 కిలోమీటర్ల కాళేశ్వరం ఫేజ్–2 సంగారెడ్డి కాల్వ నిర్మాణానికి వ్యవసాయ భూములు గుర్తించారు. ఈ భూముల్లో బోరుబావులు, పైప్‌లైన్ వివరాలను ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం బాధిత రైతులకు పరిహారం ఇస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కిషన్, ఆదిత్య, రూపేందర్‌షేకావత్ తెలిపారు.

సేంద్రియ సాగుతో భూసారం పెంపు



పోతాన్‌పల్లి మహిళా రైతులకు భూసార పత్రాలు అందజేస్తున్న సెహగల్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): సేంద్రియ సాగుతో భూసారం పెంచుకోవాలని సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ వాణి పేర్కొన్నారు. మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో గురువారం మహిళా రైతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసార పరీక్ష పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. పంటలకు అవసరమైన మోతాదులోనే సూక్ష్మ, స్థూల పోషకాలను అందించాలని తెలిపారు. ఫౌండేషన్ అందించిన విత్తనాలు వ్యవసాయ పరికరాలతో ఎలా లబ్ధిని పొందారని నవనీత్‌అగర్వాల్ మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు వ్యవసాయంలో క్షేత్రస్థాయిలోనే సాంకేతిక అంశాలపై సహకారాం అందిస్తామని అవినాష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సునీల్, విక్రమ్, విజయ్, శ్రవణ్ మహిళలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును అందరూ గౌరవించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణ బిల్లు న్యాయమైందని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతీ ఒక్కరు గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మురళితో కలిసి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సుప్రీం కోర్టు న్యాయబద్ధమేనని చెప్పగా, మాల సోదరులు ఎందుకు ఆందోళన చెందుతున్నారన్నారని అన్నారు. వర్గీకరణతో అన్ని వర్గాల దళిత బిడ్డలకు న్యాయం జరుగుతుందన్నారు.

బదిలీలు సహజం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగరీత్యా బదిలీలు, పదోన్నతులు సహజమని ఎస్‌ఐ రాజు అన్నారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన్న శేఖర్‌గౌడ్ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సదాత్ మియా, హెడ్ కానిస్టేబుల్ లాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

చేగుంట(తూప్రాన్): పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ హెచ్చరించారు. గురువారం మండలంలోని రుక్మాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వైకుంఠధామాలను పరిశీలించి హరితవనం మొక్కలను నాటించాలని ఉపాధి హామీ ఏపీఓ స్వేతకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధరకే యూరియా అమ్మకాలు

- కొత్తపల్లి ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ రమేశ్



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రమేశ్, రైతు

పాపన్నపేట(మెదక్): రైతుల సమ్మతితో మా ర్కెట్ ధర ప్రకారమే కాంప్లెక్స్, యూరియా అమ్మకాలు జరుపుతున్నట్లు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రమేశ్ తెలిపారు. సంబంధిత రైతులతో కలసి కొత్తపల్లి లో గురువారం ఆయన మాట్లాడుతూ.. యూ రియా కొనుగోలు ధరకు, దిగుమతి, ఎగుమతి, హమాలీ, డ్రైవర్ బత్తాలు రూ.13 కలిపి విక్రయాలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ అధికారులు ప్రతీ వారం తమ షాపును తనిఖీ చేస్తూ.. ఎమ్మార్పీ ధర అమలు తీరును పరిశీలిస్తున్న రని చెప్పారు. పీఓఎస్ మిషన్ ప్రకారం స్టాక్ ఎంట్రీలు చేస్తున్నామ అన్నారు. యూరి యా విక్రయాలకు సంబంధించి అదనంగా తీసుకుంటున్న రూ.13 హమాలీ, డ్రైవర్ బత్తాలకు సంబంధించినవే నన్నారు. ఈ విషయంలో వ్య వసాయ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని సొసైటీ పరిధిలోని రైతులు స్పష్టం చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

టేక్మాల్(మెదక్): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీడీఓ రియాజొద్దీన్ తెలిపారు. గురువారం టేక్మాల్‌లో మహిళా శిశు సంక్షమ శాఖ ఏసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ కవిత మాట్లాడుతూ.. భ్రూణహత్యలను పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994ప్రకారం చట్టరీత్యా నేరమన్నారు. క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ఆడపిల్లలని చదివించాలని, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి, సుకన్య సమృద్ధి యోజన పథకాలను వివరించారు. బాల్య వివాహ నిర్మూలన, మహిళలకు ఎ ఇబ్బందులు కల్గిన టోల్ ఫ్రీ నెంబర్స్ 181, 1098, 100, 1930 వినియోగించుకోవాలన్నారు. ఇందులో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



నర్సాపూర్: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు

నర్సాపూర్: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాంచందర్, లత, కమిషనర్ జైత్‌రాంనాయక్, పాఠశాల హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో మురుగు కాల్వలు శుభ్రం చేసి, దోమల మందు స్ప్రే చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవేందర్, కౌన్సిలర్లు, అధికారులు వార్డుల్లో పర్యటించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మొక్కలు పంపిణీ చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని దేవులపల్లిలో స్వచ్ఛదనం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఏపీఎం సంగమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కౌడిపల్లిలో ఎంపీఓ కలీముల్లా పారిశుద్ధ్య పనులు పరిశీలించి పరిసరాలు శుభ్రం చేశారు.

హవేళిఘణాపూర్(మెదక్): వ్యాధుల ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చౌట్లపల్లి గ్రామంలో మురుగునీటి కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీశ్వర్‌గౌడ్, పంచాయతీ సెక్రటరీ గురువయ్య, అంగన్‌వాడీ టీచర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్ ఆధ్వర్యంలో రాంపూర్, అంసాన్పల్లి తుక్యతండాలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మదన్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఏఎన్‌ఎం ప్రవీణ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మనోహరాబాద్(తూప్రాన్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కూచారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రం చేయించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, హైస్కూల్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సింహ, కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణతేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామాయంపేటలో క్రిమిసంహారక మందు స్ప్రే చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

గ్రామాల్లో ఫీవర్ సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లో వైద్యసిబ్బంది గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. మండలం పరిధిలోని మనంతయపల్లి తండాలో ఏఎన్‌ఎం మాధురి, అంగన్‌వాడీ టీచర్ మణి ఇంటింటికీ తిరిగి తండావాసులు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరం ఉన్నవారి వివరాల నమోదు చేసుకున్నారు. దీంతోపాటు మహ్మద్‌నగర్, తునికి గ్రామాల్లో ఏఎన్‌ఎంలు రాజమణి, లక్ష్మి ఫీవర్ సర్వే చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాలకు చేయూత**

శివ్వంపేట(నర్సాపూర్): గతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన పాఠశాల విద్యార్థులకు గురువారం చేయూత నందించారు. మండల పరిధిలోని శభాష్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన స్వప్న గురువారం విద్యార్థుకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆమెను సన్మానించారు.

◆ **ప్రభుత్వ పథకాలు వివరించాలి**

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శివ్వంపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ కండువాలు వేసి ఆహ్వానించారు.

◆ **బోరుబావి తవ్వకం**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం గ్రామస్తుల సౌకర్యార్థం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి సహకారంతో గురువారం బోరుబావి తవ్వకం చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్, జనరల్ సెక్రెటరీ నాని, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, బూత్ అధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మందకృష్ణకు స్వాగతం పలికేందుకు తరలిరావాలి**

వెల్దుర్తి(తూప్రాన్): ఢిల్లీ నుంచి 13న హైదరాబాద్‌కు వస్తున్న ఉద్యమ నాయకుడు మందకృష్ణకు స్వాగతం పలికేందుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి తెలిపారు.

◆ **స్వాగతం**

మెదక్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డికి పార్టీ నాయకులు గురువారం మెదక్‌లో ఘన స్వాగతం పలికారు. ఇటీవల ఆమె అమెరికా పర్యటన ముగించుకొని మెదక్ జిల్లా పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **సన్మానం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాలలో బదిలీ అయిన, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, మాజీ ఎంపీపీ యాదాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **గ్రామాభివృద్ధికి సహకరిస్తాం**

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ అవసరాలకు తమ సహకారం అందిస్తామని బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ విజయ్ అన్నారు. గురువారం మండలంలోని గౌతోజీగూడెం గ్రామంలో తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చెరువు కట్ట మరమ్మతు పనులను పరిశీలించారు. వీరి వెంట మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్, మాజీ వార్డు సభ్యులు, బాలావికాస్ ప్రతినిధి మోజేస్, ఫీల్డ్ ఇన్‌చార్జి రహమాన్, గ్రామనాయకులు సత్యనారాయణ, నర్సింలు, బాలేష్ తదితరులున్నారు.

◆ **ఘనంగా ఘట్టమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో కోలిగడ్డ వీధిలోని ఘట్టమ్మ స్థిర విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామాల్లో ఫీవర్ సర్వే**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లో వైద్యసిబ్బంది గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. మండలం పరిధిలోని మనంతయపల్లి తండాలో ఏఎన్‌ఎం మాధురి, అంగన్‌వాడీ టీచర్ మణి ఇంటింటికీ తిరిగి తండావాసులు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు మహ్మద్‌నగర్, తునికి గ్రామాల్లో ఏఎన్‌ఎంలు రాజమణి, లక్ష్మి ఫీవర్ సర్వే చేశారు.

◆ **పంచాయతీ కార్మికుల ధర్నా**

జోగిపేట(అందోల్): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కనీస వేతనం, ఈఎస్‌ఐ పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జోగిపేటలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విద్యాసాగర్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.